క్లుప్తంగా

పీహెచ్‌సీల్లో తనిఖీలు



రాయవరం పీహెచ్‌సీలో సిబ్బందికి సూచనలిస్తున్న సత్యనారాయణ

రాయవరం: మండలంలోని రాయవరం, మాచవరం పీహెచ్‌సీలను జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి బీవీవీ సత్యనారాయణ సోమవారం తనిఖీ చేశారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్రలో భాగంగా పీహెచ్‌సీలను సందర్శించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పబ్లిక్ టాయిలెట్స్, పీహెచ్‌సీలో పరిశుభ్రత ఎలా ఉంది ? ఘన వ్యర్థాల ప్రాసెస్ తదితర విషయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి సత్యనారాయణ మాట్లాడుతూ బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణకు పసుపు, ఎరుపు, తెలుపు, నీలం రంగు కంటైనర్లను వాడాలని సూచించారు. సాధారణ వ్యర్థాలకు నల్లటి కంటైనర్‌ను వాడాలన్నారు. 2047 నాటికి సంపన్న ఆరోగ్యకరమైన రాష్ట్ర సాధనలో భాగంగా ప్రతి ఒక్కరూ పరిశుభ్రతకు పెద్దపీట వేయాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు రమ్యశ్రీ, మణికంఠ, డివిజనల్ సూపర్‌వైజర్ జి.కమల్‌శేషు, సీహెచ్‌వో ఓ.ప్రభావతి, సూపర్‌వైజర్లు అప్పారావుచౌదరి, ప్రసాద్, సత్యవతి, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కాజులూరు: కాకినాడ, కోటిపల్లి రహదారిలో కాజులూరు మండలం ఆర్యావటం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రగాయాల పాలయ్యాడు. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడ సూర్యనారాయణపురానికి చెందిన నూలు రామకృష్ణ తన మోటారుబైక్‌పై ద్రాక్షారామ వెళ్లి తిరిగి వస్తున్నారు. ఆర్యావటం వాటర్‌ట్యాంక్ వద్దకు వచ్చేసరికి రోడ్డుపై నడచి వెళుతున్న వ్యక్తి అడ్డుగా రావడంతో బ్రేక్ వేసాడు. బైక్ పల్టీలు కొట్టడంతో రామకృష్ణ గాయాలపాలయ్యాడు. స్థానికులు గమనించి క్షతగాత్రుడిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

యూరియా లభ్యతపై అవగాహన కార్యక్రమాలు

రామచంద్రపురం రూరల్: కలెక్టర్ ఆదేశాల మేరకు రైతు సేవా కేంద్రాల వద్ద ఈ నెల 7 నుంచి 10వ తేదీ వరకు యూరియా లభ్యతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు రామచంద్రపురం ఆర్డీఓ దేవరకొండ అఖిల తెలిపారు. మండలంలోని ఓదూరు, నరసాపురపుపేట, యనమదల, కాపవరం, ఏరుపల్లి గ్రామాలలో సోమవారం మండల వ్యవసాయ అధికారి టీవీఆర్ మణిదీప్ ఆధ్వర్యంలో ఈ సమావేశాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆర్డీఓ అఖిల పాల్గొని యూరియా కొరత నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు రైతులకు వివరించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కల రిష్వంత్ రాయ్, ఏడీఏ బి. నాగకుమార్, తహసీల్దార్ బి. మృత్యుంజయరావు పాల్గొన్నారు.

భీమేశ్వరుని దర్శించుకున్న తెలంగాణ చీఫ్ సెక్రటరీ

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామిని తెలంగాణ చీఫ్ సెక్రటరీ సోమేశ్‌కుమార్ సోమవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బేడా మండపంలో పండితులు ఆయనకు వేదాశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఎస్ వెంట దాత మీనవిల్లి వెంకట శ్రీనివాస్ పాల్గొన్నారు. రాష్ట్ర కోస్టుగార్డు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ కమాండర్ రాజేష్ మిట్టల్ స్వామి, అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం



అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్టు అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం: స్థానిక ప్రాంతీయ ఆసుపత్రిలో సోమవారం సుమారు రూ.40 లక్షల అంచనా వ్యయంతో సిద్ధం చేసిన అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్ (ఏఎల్ఎస్) 108 అంబులెన్స్‌ను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు తెలిపారు. ఈ వాహనంలో ఒకేసారి ముగ్గురు రోగులను తరలించేందుకు వీలుందన్నారు. ఈ వాహనంలో 28 రకాల అత్యవసర ఔషధాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అధికారి అవినాష్, మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కల రిషిత రామ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగు.. లాభాలు బాగు

- ప్రోత్సాహకాలు అందిస్తున్న ఉద్యాన శాఖ
- ఆసక్తి చూపుతున్న అన్నదాతలు
- రెండు నియోజకవర్గాల్లో 1,144 ఎకరాల్లో సాగు
- విస్తీర్ణం మరింత పెంచేందుకు కార్యాచరణ



ఆయిల్ పామ్ తోటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారులు

కపిలేశ్వరపురం: ఆయిల్ పామ్ సాగు రైతులకు లాభసాటి మారింది. రైతులకు ఉద్యాన శాఖ ద్వారా పోత్సాహకాలు అందించడంతో అన్నదాతలు సాగుపై ఆసక్తి చూపుతున్నారు. మారిన మార్కెట్, వాతావరణం, సాగు పద్ధతుల నేపథ్యంలో వ్యవసాయంలో అనేక నూతన పద్ధతులు ఉనికిలోకి వచ్చాయి. రైతులు సంప్రదాయ పంటల సాగుకే పరిమితం కాకుండా లాభసాటిగా ఉంటే ఉద్యాన పంటల సాగు వైపు మళ్లాలని అధికారులు సూచిస్తున్నారు. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించే దిశగా ఉద్యాన శాఖాధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు.

రాయితీలతో మేలు

ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు ఉద్యాన శాఖ రాయితీలు అందిస్తోంది. ఇటీవల కాలంలో ఉద్యాన శాఖ, పతంజలి ప్రైవేటు లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో మండపేట మండలం కేశవరంలో ఆయిల్ పామ్ విస్తరణకు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. సాగు పద్ధతులు, ప్రభుత్వ రాయితీలపై రైతులకు రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో ఉద్యాన శాఖ హెచ్‌ఓ ఎం.అనూష పర్యవేక్షణలోని ఉద్యాన సహాయకులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మొక్కలను సమకూర్చుకోవడం నుంచి, గుంతలు తవ్వి నాటడం, ఇరిగేషన్, మార్కెటింగ్ విభాగాల్లో సైతం ఉద్యాన శాఖ తోడుగా ఉంటుందని చెబుతున్నారు. మొక్కల నిమిత్తం హెక్టారుకు రూ.29,000 రాయితీ ఇస్తున్నారు. సాగు నిర్వహణ నిమిత్తం హెక్టారుకు సంవత్సరానికి రూ.5,250 చొప్పున నాలుగేళ్లకు రూ.21 వేలు ఖర్చు చేయాల్సి వస్తుంది. అంతర పంటల నిమిత్తం హెక్టారుకు సంవత్సరానికి రూ.21 వేలు రాయితీ కల్పిస్తున్నారు. గుంతలు తీసి మొక్కలు నాటడం, డ్రిప్ పద్ధతిలో నీరు పెట్టడమనే పనులను ఉపాధి హామీ పథకంతో అనుసంధానం చేస్తున్నారు. డ్రిప్ పరికరాలను ఎస్సీ రైతులకు నూరుశాతం, చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం, పెద్ద రైతులకు 50 శాతం రాయితీపై అందజేస్తారు.

అన్నివిధాలా అనుకూలం

కోనసీమ జిల్లాలోని నేలలు ఉద్యాన సాగుకు అనుకూలంగా ఉంటాయి. సారం కలిగి ఉండటంతో పాటు తగినంత భూగర్భ, కాలువ నీటి వనరులు, అనువైన వాతావరణ పరిస్థితులు మరింత సానుకూలం. మొత్తం వంట నూనె దిగుమతిలో 80% కలిగి ఉన్న అన్ని కూరగాయల నూనె గింజల పంటలతో పోలిస్తే ఆయిల్ పామ్ అత్యధిక దిగుబడినిచ్చే పంట. మొక్కలు వేసిన నాల్గో సంవత్సరం నుంచి దిగుబడి ప్రారంభమవుతుంది. ఎకరానికి సంవత్సరానికి 7–10 మెట్రిక్ టన్నుల సగటు దిగుబడి వస్తుంది. వరికి ఆయిల్ పామ్ మంచి ప్రత్యామ్నాయ పంట. ఉద్యాన శాఖ పర్యవేక్షణలో నాణ్యమైన మొక్కలను పంపిణీ చేస్తున్నారు.

తెగుళ్ల బెడద తక్కువ

ఆయిల్ పామ్ సాగుకు తెగుళ్ల బెడద తక్కువ ఉంటుంది. ప్రతి 15 రోజులకు లేదా 30 రోజులకు ఒకసారి చొప్పున ఏడాది పొడవునా ఆదాయాన్ని ఇస్తుంది. 40–50 సంవత్సరాల వరకు దిగుబడిని వస్తుంది. కోతులు బెడద, దొంగతనం తలెత్తవు. మార్కెటింగ్‌లో మధ్యవర్తుల జోక్యం ఉండదు.

వరికి సరైన ప్రత్యామ్నాయ పంట



ఆయిల్ పామ్ వరి పంటకు సరైన ప్రత్యామ్నాయ పంట. ఆయిల్ పామ్ సాగుపై రైతులను ప్రోత్సహించడానికి ఉద్యానవన శాఖ సబ్సిడీలను అందిస్తోంది. నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ ద్వారా ఆయిల్ పామ్ విస్తీర్ణాన్ని, చమురు ఉత్పత్తిని పెంచడానికి పలు పథకాలను అమలు చేస్తున్నారు.

– ఎం.అనూష, హార్టీ కల్చర్ అధికారి, రామచంద్రపురం

రెండు నియోజకవర్గాల్లో ఆయిల్ పామ్ సాగు వివరాలు

మండలం	ప్రస్తుతం సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)	2025-26 సాగు లక్ష్యం (ఎకరాల్లో)
మండపేట	863	125
రాయవరం	33	83
కపిలేశ్వరపురం	125	83
రామచంద్రపురం	40	83
కె.గంగవరం	63	83
కాజులూరు	20	125
మొత్తం	1,144	582

గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలి

కాజులూరు: గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది వైద్యశిబిరాలను ఏర్పాటు చెయ్యాలని పల్లిపాలెంకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కాజులూరి సిద్ధార్థ రెడ్డి తదితరులు కోరుతున్నారు. సోమవారం గ్రామంలో వారు మాట్లాడుతూ వర్షాకాలం కారణంగా గ్రామంలో అపరిశుభ్రత నెలకొని, అంటువ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఇటీవల మండల పరిసర గ్రామాల్లో అపరిశుభ్రత కారణంగా దోమల ఉధృతి పెరిగి పలువురు డెంగీ, విషజ్వరాల బారినపడ్డారని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి వైద్యశిబిరాలను ఏర్పాటు చెయ్యాలని కోరారు.

వైఎస్సార్ సీపీ నేత కిశోర్‌కు పరామర్శ

కపిలేశ్వరపురం: మాతృ వియోగంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సేవాదళ్ కన్వీనర్ పాలింగి కృష్ణ కిశోర్‌ను ఆ పార్టీ నాయకులు సోమవారం పరామర్శించారు. పార్టీ మండల అధ్యక్షుడు గూటం సత్యనారాయణ, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, పరిషత్ విప్ పలివెల మధు, నాయకులు ప్రగడ అర్జునరావు, వంగా నల్ల శ్రీను, కవల శ్రీనివాస్, పుట్టపూడి చక్రం, పుట్టా గోవిందరాజు తదితరులు పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అన్నదాత పోరును విజయవంతం చేయండి

వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ సూర్యప్రకాశ్



రామచంద్రపురం: రాష్ట్రంలో రైతులను ఆదుకోవటంతో కూటమి ప్రభుత్వం విఫలమైందని, యూరియా కొరతపై మంగళవారం నిర్వహించనున్న రైతు పోరు కార్యక్రమాన్ని రామచంద్రపురంలో నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షులు, పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. పంటల బీమా, రుణమాఫీ, కనీస మద్దతు ధర తదితర హామీలను అమలు చేయకుండా రైతులను కూటమి ప్రభుత్వం పూర్తిగా మోసం చేసిందన్నారు. వరదలు, అకాల వర్షాల తర్వాత దెబ్బతిన్న పంటలకు పూర్తిగా పరిహారం అందించలేదన్నారు. ఎరువులు, విత్తనాలు, డీజిల్ ధరలు పెరిగినా రైతులకు అందించే సబ్సిడీలను కూటమి ప్రభుత్వం తగ్గించిందని విమర్శించారు. రైతులు యూరియా కోసం పడిగాపులు పడాల్సిన దుస్థితి నేడు నెలకొందని అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎటువంటి ఇబ్బందులు లేకుండా రైతులకు కావాల్సిన ఎరువులు, పురుగు మందులు సరఫరా చేసినట్టు పేర్కొన్నారు. యూరియా కోసం రైతులు నానా అవస్థలు పడుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని సూర్యప్రకాశ్ విమర్శించారు. రైతుల పడుతున్న కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు పట్టణంలోని పార్టీ కార్యాలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు రైతులు, కార్యకర్తలతో ర్యాలీగా వెళ్లి అధికారులకు వినతిపత్రం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, పార్టీ కార్యకర్తలు భారీగా పాల్గొనాలని ఆయన పిలుపు నిచ్చారు.

'అన్నదాత పోరుబాట'ను విజయవంతం చేయాలి

కపిలేశ్వరపురం: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం రామచంద్రపురం ఆర్డీఓ కార్యాలయం ఎదుట చేపట్టనున్న 'అన్నదాత పోరుబాట' ఆందోళనను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మండపేట విజయలక్ష్మి నగర్‌లోని పార్టీ కార్యాలయం నుంచి ఉదయం 9.30 గంటలకు బైక్ ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. పట్టణ వీధుల్లో నిరసన తెలిపి అనంతరం రామచంద్రపురం ఆర్డీఓ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లనున్నట్టు తెలిపారు. మండపేట పట్టణం, మండపేట రూరల్, కపిలేశ్వరపురం, రాయవరం మండలాల నుంచి పెద్ద ఎత్తున రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఎమ్మెల్సీ తోట కోరారు.

యూరియా కొరత తీర్చాలి



పామర్రు పంచాయతీ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులు

కె.గంగవరం: తొలకరి సాగు ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు పామర్రు రైతులకు ఒక్క యూరియా బస్తా కూడా రాలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్రామంలోని సచివాలయం వద్ద సోమవారం రైతులు యూరియా కొరతపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొసైటీలో, రైతు సేవా కేంద్రం వద్ద ఇప్పటి వరకు రైతులకు యూరియా అమ్మకాలు జరగలేదని వారు చెబుతున్నారు. తప్పని సరి పరిస్థితుల్లో పక్క గ్రామాలకు వెళ్లి యూరియా బస్తాలు తెచ్చి పంటలు సాగు చేస్తున్నామని వారన్నారు. వ్యవసాయ శాఖ సిబ్బందిని అడిగితే గ్రామంలో యూరియా బస్తాలు రావడానికి లైసెన్సు లేకపోవడం వల్ల ఇబ్బంది ఏర్పడిందన్నారు. త్వరలో లైసెన్సు పొంది యూరియా బస్తాలను అందిస్తామని సిబ్బంది చెబుతున్నారని, అధికారులు స్పందించి యూరియా సమస్యను పరిష్కరించాలని రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రామచంద్రపురం రూరల్: వెంకటాయపాలెం శివారు దాసరిపాడు ఆంజనేయస్వామి ఆలయం వద్ద గత నెల 8న ఎదురెదురుగా మోటారు సైకిళ్లు ఢీకొన్న ఘటనలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ సోమవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. కె.గంగవరం మండలం కుందూరు లంకకు చెందిన ఇళ్ల సత్యనారాయణ (50) ద్రాక్షారామంలో ఫ్యాన్సీ స్టోర్ వ్యాపారం నిర్వహించేవారు. ఆగస్టు 31న రాత్రి 8.30 గంటల సమయంలో వ్యాపారం ముగించుకుని తన మోటారు సైకిల్‌పై ఇంటికి వెళుతుండగా ఎదురుగా వచ్చిన మోటారు సైక్లిస్టు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సత్యనారాయణ తలకు తీవ్ర గాయం కావడంతో రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న సత్యనారాయణ సోమవారం మృతి చెందారు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం, మృతుడి భార్య కనకలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేత్రదానంపై అవగాహన ర్యాలీ



దంగేరులో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది



రాయవరంలో నేత్రదానంపై ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

కె.గంగవరం: మండల పరిధిలోని దంగేరు, పేకేరు, కుందూరు పీహెచ్‌సీల పరిధిలోని వైద్య సిబ్బంది సోమవారం నేత్రదానంపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. తొలుత ఆయా గ్రామ పరిధిలోని పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ప్లకార్డులు, నినాదాలతో నేత్రదానం చేయండి, ఇద్దరు అంధులకు వెలుగునివ్వండి అంటూ ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ జాయ్ కేథరిన్, డాక్టర్ ఆమని, డాక్టర్ ప్రతాప్, డాక్టర్ రేఖా రాణి తదితరులు మాట్లాడుతూ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు సందర్భంగా ర్యాలీ నిర్వహించామన్నారు. ప్రతి ఒక్కరూ నేత్రదానంపై అవగాహన కలిగిఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ పద్మేష్‌బాబు, ఎస్ సునంద, రమణ, వెంకటరావు, జ్యోతి, ఏఎన్‌యంలు, ఆశా కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాయవరం: జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం రాయవరంలో నేత్రదానంపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. రాయవరం, మాచవరం పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది నేత్రదానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జాతీయ అంధత్వ నివారణ సంస్థ ఆప్తాల్మిక్ ఆఫీసర్ పి.శ్రీలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఘన సత్కారం



ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించిన విద్యాశాఖ అధికారులు

రామచంద్రపురం రూరల్: ఏటా ఉపాధ్యాయ దినోత్సవం అనంతరం విశ్రాంత ఉపాధ్యాయులు, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను సత్కరించడం రామచంద్రపురం విద్యాశాఖ ఆనవాయితీగా వస్తోంది. రామచంద్రపురం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలోని వైఎస్ రాజశేఖరరెడ్డి వేదికపై ఆరుగురు విశ్రాంత ఉపాధ్యాయులు, గత ఏడాది జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న ఇద్దరిని సోమవారం ఘనంగా సత్కరించారు. రామచంద్రపురం ఎంపీపీ అంబటి భవాని అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం చేతుల మీదుగా వీరిని దుశ్శాలువాలు, పూలదండలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓలను ఏపీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు వాడ్రేవు శ్రీనివాస్, నాయకులు సన్మాన గ్రహీతల ముఖ చిత్రాలతో కూడిన మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు తాడి వీర రాఘవరెడ్డి, వాసంశెట్టి నాగేశ్వరి, కృత్తివెంటి పేర్రాజు పంతులు ట్రస్ట్ చైర్మన్ నాయుడు మాస్టారు, మున్సిపల్ కౌన్సిలర్ వాడ్రేవు సాయిప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పాఠశాలకు సైన్స్ కిట్ బహూకరణ



సోమేశ్వరంలో హెచ్‌ఎం దయామణికి సైన్స్ కిట్‌ను అందజేస్తున్న పీఎస్ టీచర్ మాధవి

రాయవరం: మండలంలోని సోమేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలకు ఫిజికల్ సైన్స్ టీచర్ పి.మాధవి సోమవారం సైన్స్ కిట్ బహూకరించారు. రూ.5,500 విలువ చేసే సైన్స్ కిట్‌ను పాఠశాల హెచ్‌ఎం ఆర్.దయామణికి అందజేశారు. అలాగే గతంలో పనిచేసిన మాచవరం జెడ్పీ ఉన్నత పాఠశాలకు కూడా సైన్స్ కిట్‌ను అందజేశారు. పాఠశాలలో సైన్స్‌ను అభివృద్ధి చేయడం, విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు సైన్స్ కిట్లను అందజేసినట్లు ఉపాధ్యాయురాలు మాధవి తెలిపారు. సైన్స్ టీచర్ మాధవిని హెచ్‌ఎం దయామణి, ఉపాధ్యాయులు అభినందించారు.

వినూత్న రీతిలో అక్షరాస్యత దినోత్సవం



సీతాఫలం గింజలను 'అ' ఆకృతిలో అమర్చిన విద్యార్థులు



'అ' అక్షరం ఆకృతిలో విద్యార్థులు

కపిలేశ్వరపురం: అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం నిడసనమెట్ట ఫౌండేషన్ స్కూల్ విద్యార్థులు 'అ' అక్షరం ఆకృతిలో సీతాఫలం గింజలను అమర్చి వినూత్న రీతిలో శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం 'అ' అక్షరం ఆకృతిలో నేలపై వాలి చిన్నారులు తమ నైపుణ్యతను ప్రదర్శించారు. వారిని పాఠశాల హెచ్‌ఎం వల్లూరి వీరవేణి అభినందించారు.

విద్యారంగ సమస్యలపై రణభేరి



మామిడికుదురులో రణభేరి పోస్టర్లు ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

మామిడికుదురు: విద్యారంగ ఆర్థిక సమస్యలపై ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా రణభేరి కార్యక్రమం నిర్వహిస్తున్నామని యూటీఎఫ్ జిల్లా కోశాధికారి సీహెచ్ కేశవరావు తెలిపారు. మామిడికుదురు ఎమ్మార్సీ వద్ద సోమవారం రణభేరి పోస్టర్లను ఆవిష్కరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడచినా ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదని కేశవరావు పేర్కొన్నారు. బోధనేతర పనులు విపరీతంగా పెరిగిపోయి బోధనకు సమయం సరిపోవట్లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పరీక్షల మూల్యాంకనం, విద్యాశక్తి ఆన్‌లైన్, అప్‌లోడ్, గ్రీన్ పాస్‌పోర్టు, పీ–4 వంటి అనేక బోధనేతర పనులతో ఉపాధ్యాయులను వేధిస్తున్నారని, తక్షణం పీఆర్సీ కమిషన్ నియమించి మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు జి.నాగేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శి బాలం పెద్దిరాజు, పీఎస్‌వీ సత్యబాబు పాల్గొన్నారు.

కొత్తపేట: ఆర్థిక, విద్యారంగ సమస్యలపై యూటీఎఫ్ రాష్ట్రస్థాయిలో తలపెట్టిన నిరసన కార్యక్రమాలు జయప్రదం చేయాలని యూటీఎఫ్ మండల శాఖ నాయకులు పిలుపునిచ్చారు. ఆ మేరకు స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద పోస్టర్స్ ఆవిష్కరించారు. సంఘ నాయకులు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడచినా ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు ఒక్కటి కూడా పరిష్కారం కాలేదని, ప్రధానంగా ఆర్థిక, విద్యారంగ సమస్యలు పరిష్కారం కాకపోగా మరింత జటిలంగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. 25న విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

బకాయిలు విడుదల చేయాలని వినతి

రాజోలు: జీతాల బకాయిలు విడుదల చేయాలని కోరుతూ 104 వాహన సిబ్బంది జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ దుర్గారావు దొరకు సోమ వారం వినతిపత్రాన్ని అందజేశారు. విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యలు, జీతాలు తగ్గుదల అంశాలపై డీఎం అండ్ హెచ్‌ఓకు వివరించారు. అరబిందో యాజమాన్యం జీతాలు విడుదల చేయక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని యూనియన్ నాయకులు తెలిపారు. అధ్యక్షులు సవరపు సతీష్, మల్లవరపు జగ్జీవన్‌రావు పాల్గొన్నారు.


బాధిత కుటుంబాలకు చేయూత

రావులపాలెం: మండలంలోని ఈతకోటలో ఆదివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాన్ని సోమవారం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి పరామర్శించారు. పార్టీ నాయకుడు కొడమంచిలి శేఖర్ అత్తయ్య కొల్లి సత్యవతి ఇల్లు అగ్ని ప్రమాదంలో పూర్తిగా కాలిపోయింది. ఈ ఘటన తెలిసి జగ్గిరెడ్డి సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి బాధితులను ఓదార్చారు. అనంతరం బాధిత కుటుంబానికి బియ్యం, నిత్యావసరాలు, రూ.5 వేలు నగదు అందజేశారు.

క్యాన్సర్ బాధితురాలికి సాయం

రావులపాలెం: కాన్సర్‌తో బాధపడుతున్న బాధితురాలి వైద్యానికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.11 వేలు ఆర్థిక సాయాన్ని సోమవారం అందజేశారు. పశ్చిమగోదావరి జిల్లా తూర్పువిప్పర్రుకి చెందిన గుత్తుల లక్ష్మి (49) గర్భాశయ క్యాన్సర్‌తో బాధపడుతోంది. ఆమెకు సంస్థ సభ్యులు రూ.11 వేల చెక్కును అందజేశారు.

విజయదుర్గా పీఠంలో హోమం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



విజయదుర్గా పీఠంలో హోమం నిర్వహిస్తున్న పురోహితులు

రాయవరం: మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో సోమవారం చంద్రగ్రహణానంతరం సంప్రోక్షణ పూజలు నిర్వహించారు. చంద్రగ్రహణ సమయంలో హోమం నిర్వహించారు. పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం(గాడ్) ఆదేశాల మేరకు పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు పర్యవేక్షణలో వేద పండితులు రాహుగ్రస్త చంద్రగ్రహణ హోమం చేశారు. రాత్రి 9.56 గంటలకు ప్రారంభమైన హోమం అర్ధరాత్రి 1.26 గంటల వరకు కొనసాగింది. అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు. గ్రహణానంతరం పీఠంలోని అమ్మవారితో పాటు పరివార దేవతలకు సంప్రోక్షణ, పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఉదయం 8 గంటల నుంచి భక్తులకు అమ్మవారి దర్శనాలు కల్పించారు. విజయదుర్గా సేవా సమితి ప్రతినిధులు భాస్కరనారాయణ, సత్యవెంకటకామేశ్వరి, బలిజేపల్లి రమ, పెదపాటి సత్యకనకదుర్గ, బుజ్జి, పీఆర్వో బాబి, భక్తులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని పలు ఆలయాల్లో అర్చకులు సంప్రోక్షణ పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

రామచంద్రపురం రూరల్: హసన్‌బాద షిర్డీ సాయి బాబా ఆలయం వద్ద గత నెల 21న ఎదురెదురుగా మోటారు సైకిళ్లు ఢీకొన్న ఘటనలో కాజులూరు మండలం తణుకువాడకు చెందిన కాకి శ్రీనివాసు కాలికి గాయాలయ్యాయి. ఆయన కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సోమవారం ద్రాక్షారామ స్టేషన్‌లో బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై ఎం. లక్ష్మణ్ కేసు నమోదు చేశారు.